ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 18 మే 2024



పూలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



గుర్రంకొండలో భారీ వర్షం

● చెరువులు, కుంటల్లోకి చేరిన నీరు



కానుగమాకులకుంటలోకి చేరిన వర్షపు నీరు

గుర్రంకొండ, మే 17: భానుడి తాపానికి ప్రజలు రెండు నెలలుగా అల్లాడిపోయారు. ఎండ వేడికి తట్టుకోలేక పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటే వణికిపోయారు. ఎండ తీవ్రతకు ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని ప్రజలు ఇళ్ల నుంచి సాయంత్రం తప్ప బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వారం రోజులుగా మేఘాలు వస్తూ అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తూ వచ్చాయి. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు గుర్రంకొండ చుట్టు పక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు కురిసిన వర్షానికి చిన్న కుంటలు నిండగా, చెరువుల్లోకి 20 శాతానికి పైగా నీరు చేరింది. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. ఈ భారీ వర్షంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది.

అరిగెలవారిపల్లెలో పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



వైభవంగా సీతమ్మ జయంతి



ఒంటిమిట్ట, మే 17: కోదండరామాలయంలో సీతమ్మ జయంతి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సంగమండపంలో ముందుగా ఉత్సవమూర్తులైన సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పూలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. మల్లెపూలు, సంపంగి, చండుమల్లి, మరువం, రోజా పూలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతమ్మ తల్లికి ఇష్టమైన పూలతో అభిషేకాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సీవీఎస్‌వో బాలిరెడ్డి, అర్చకులు రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



● పోలింగ్ సరళిపై ముఖ్య నాయకుల ఆరా..
● పోలింగ్ కేంద్రాల వారీగా సమాచార సేకరణ
● ఇరుపార్టీల్లోనూ.. గెలుపుపై ధీమా..



ఆ ఓట్లన్నీ మాకే..

గెలిచేది మేమే..!

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశాం. అంతేకాకుండా.. మంచీ, చెడ్డా చూసుకున్నాం.. ఇంటింటికీ వెళ్లి డబ్బు చేతికి ఇచ్చాం. ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉండేటట్లు చేశాం. ఈసారి గతంలో కంటే ఎక్కువగా పోలింగ్ జరిగింది. ఆ పడిన ఓట్లన్నీ మనకే.. గెలిచేదీ మనమే.. ఇదీ ప్రస్తుతం జిల్లాలో ఏ పార్టీలో చూసినా.. ముఖ్య నాయకులకు ద్వితీయ శ్రేణి నాయకులు చెబుతున్న మాటలు.

పెరిగిన ఓటింగ్ శాతం

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలో 78.05 శాతం పోలింగ్ నమోదైంది. 2024 ఎన్నికల్లో ఇది 79.09 శాతానికి పెరిగింది. ఒక శాతానికి పైగా పెరిగింది. 2024 ఎన్నికల్లో జిల్లాలో పోలైన ఓట్లు నియోజకవర్గాల వారీగా చూస్తే...

● రాజంపేటలో మొత్తం 2,41,200 ఓట్లు ఉన్నాయి. ఇందులో 1,83,442 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 87.790, స్త్రీలు 95,652 పోలయ్యాయి. 76.05 శాతంగా నమోదైంది.

● రైల్వేకోడూరు నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,04,466, పోలైన ఓట్లు 1,52,352. పురుషులు 73,711, స్త్రీలు 78,639, ఇతరులు 2 పోలయ్యాయి. 74.51 శాతం నమోదైంది.

● రాయచోటిలో మొత్తం ఓట్లు 2,55,168, పోలైనవి 1,97,463. పురుషులు 96,426, స్త్రీలు 1,01,031, ఇతరులు 6 పోలయ్యాయి. 77.39 శాతం పోలింగ్ నమోదైంది.

● తంబళ్లపల్లె మొత్తం ఓట్లు 2,24,802, పోలైన ఓట్లు 1,86,790. పురుషులు 92,885, స్త్రీలు 93,901, ఇతరులు 4 నమోదయ్యాయి. 83.09 శాతం నమోదైంది.

● పీలేరులో మొత్తం ఓట్లు 2,34,608, పోలైనవి 1,90,234. పురుషులు 93,849, స్త్రీలు 96,369, ఇతరులు 16 ఉన్నారు. 81.09 శాతం ఓటింగ్ నమోదైంది.

● మదనపల్లెలో మొత్తం ఓట్లు 2,66,590, పోలైనవి 2,00,247. పురుషులు 98,471, స్త్రీలు 1,01,755, ఇతరులు 21 ఉన్నారు. 75.11 శాతం ఓటింగ్ నమోదైంది.

పోలింగ్ సరళిపై ముఖ్య నాయకుల ఆరా..

పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచి ద్వితీయ శ్రేణి నాయకుల హడావుడి ఎక్కువైంది. తమతో పాటు చోటామోటా నాయకులు, అనుచరులను వెంట పెట్టుకుని ముఖ్యనాయకులను కలుస్తున్నారు. వీళ్లంతా అభ్యర్థులను కలిసి ఓటింగ్ సరళి గురించి వివరిస్తున్నారు. తాము ఎంతో కష్టపడ్డామని, తమ పోలింగ్ బూత్‌లో మనకే ఎక్కువ ఓట్లు పడ్డాయని నమ్మబలుకుతున్నారు. కులాల వారీగా ఎన్ని ఓట్లు పడ్డాయో వివరిస్తున్నారు. ఎంత డబ్బు పంచిపెట్టింది.. కానుకలు ఎలా ఇచ్చిందీ వివరిస్తూ.. మనకే ఓట్లు పడి ఉంటాయని చెబుతున్నారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల జాబితాను చంకలో పెట్టుకుని నాయకులకు వివరిస్తున్నారు. సందులో సడేమియా అన్నట్లు తమ పార్టీలోనే తమకు కానివాళ్లపైన చాడీలు చెబుతున్నారు. పక్క పార్టీ వాళ్లతో లోపాయికారీ ఒప్పందానికి వచ్చారని చెబుతున్నారు. ప్రత్యర్థి పార్టీల నాయకుల గురించి చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే హడావుడి కనిపిస్తోంది. ఈ నాయకులు చెప్పింది నమ్మలేని ముఖ్యనాయకులు, అభ్యర్థులు పూర్తి స్థాయిలో సమాచారం కోసం ఇతర మార్గాలను ఆశ్రయిస్తున్నారు. విలేకరులు, ఇంటెలిజెన్స్ పోలీసులతో మాట్లాడి అసలేం జరిగింది. ఎన్ని ఓట్లు తమకు పడి ఉంటాయో అని ఆరా తీస్తున్నారు. ఓటర్ల నాడి ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో వాట్సప్ గ్రూపులు, యూట్యూబులలో వచ్చే సర్వేలను గమనిస్తున్నారు. వీటిని బట్టి కూడా తమ నియోజకవర్గంలో ఏం జరిగి ఉంటుందోనని విచారిస్తున్నారు.

అన్ని పార్టీల్లోనూ.. గెలుపు ధీమా..

ఎన్నికల్లో గెలుపుపై దాదాపు అన్ని పార్టీల్లోనూ.. ఒకే రకమైన ధీమా కనిపిస్తోంది. పడిన ఓట్లలో తమకే ఎక్కువ పడి ఉంటాయని అనుకుంటున్నారు. ఒకవేళ మెజార్టీ తగ్గినా.. గెలుపు ఖాయం అని లెక్కలు వేసుకుంటున్నారు. ఇంకా కొందరు పదివేలు, పదిహేను వేలు, ఇరవై వేలు మెజార్టీ వస్తుందని ధీమాతో ఉన్నారు. జిల్లాలో వైసీపీ అభ్యర్థులు నవరత్నాల పేరుతో తమ ముఖ్యమంత్రి బటన్లు నొక్కాడు కాబట్టి.. తమకే ఓట్లు పడి ఉంటాయని ఆశిస్తున్నారు. గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు ప్రజలు పట్టించుకొని ఉండరు అని ఊహిస్తున్నారు. ప్రభుత్వంపై చిన్న విమర్శలు చేసినా.. కేసులు, దాడులు చేసిన సంగతులను అధికార పార్టీ మర్చిపోతుంది. దీనికి తోడు ప్రతిపక్ష పార్టీలతో పోల్చితే.. పోల్ మేనేజ్‌మెంటు బాగా చేశాం కాబట్టి.. పార్లమెంటు స్థానంతో పాటు జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ..గెలుపు తమదేనని ఊహల్లో ఉన్నారు.

ఇదే సమయంలో ప్రభుత్వంపైన తీవ్ర వ్యతిరేకత ఉందని, అధికార పార్టీ చేసిన ఆగడాల వల్ల ప్రజలు తమకు ఓటు వేసి ఉంటారని భావిస్తున్నారు. 2019 ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలలో ముఖ్యమైన ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చేయకపోవడంతో.. నిరుద్యోగులు, సీపీఎస్ రద్దు చేయకపోవడంతో ఉద్యోగులు, నాసిరకం మద్యం అమ్మకాల వల్ల మందుబాబులు, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల వల్ల సామాన్యులు ప్రభుత్వానికి ఓటు వేయకుండా తమకే వేసి ఉంటారని కూటమి నాయకులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ల్యాండ్ టైటిల్ యాక్టు వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదనే అంశం సైతం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లింది. ఇదే సమయంలో పోలింగ్ శాతం పెరగడం..పెద్ద సంఖ్యలో మహిళలు ఓటు వేయడంతో..తమకే అనుకూలమని కూటమి నాయకులు భావిస్తున్నారు. ఈ ఊహలు, అంచనాలకు తెరపడాలంటే వచ్చేనెల 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే. అప్పటి వరకు ద్వితీయ, గ్రామ స్థాయి నాయకులు చెబితే కాకిలెక్కలకు ముఖ్యనాయకులు తలలూపాల్సిందే.



స్ట్రాంగ్‌రూంల పరిశీలన

● భద్రతపై పోలీసులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష



స్ట్రాంగ్‌రూములను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాయచోటిటౌన్, మే 17: జిల్లాకు చెందిన ఆరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరచినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. శుక్రవారం సాయి ఇంజనీరింగ్ కాలేజ్‌లో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ సాయి ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ, మొబైల్ టీం, సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్సెస్, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 144 సెక్షన్ కౌంటింగ్ ముగిసే వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఆదేశాల మేరకు జిల్లా ప్రజలందరూ ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని కోరారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఉపాధి పనులు చేస్తూ ఇరువురి మృతి


● వడదెబ్బతో ఒకరు.. గుండెపోటుతో మరొకరు

రైల్వేకోడూరు(రూరల్)/సుండుపల్లె, మే 17: మండలంలోని బొజ్జావారిపల్లి గ్రామ పంచాయతీలో కాలువ పూడిక తీస్తూ ఉపాధి హామీ కూలీ పాలెంకోట వెంకటేశ్ (55) వడదెబ్బతో మృతి చెందాడు. మృతుడు వెంకటేశ్ రెండు రోజుల నుంచి అనారోగ్యంతో కోడూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. శుక్రవారం కాలువ పూడిక తీస్తుండగా కళ్లు తిరిగి పడిపోయాడు. స్థానిక ఉపాధి హామీ కూలీల సహాయంతో ఇంటికి తీసుకుని వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కూలీలు తెలిపారు.

సుండుపల్లె మండలం రాయవరం గ్రామ పంచాయతీ దిగువ జంగంపల్లెకు చెందిన అమరావతమ్మ (59) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వెళ్లి కొత్తజంగంపల్లె సమీపంలో ఉపాధి పని చేస్తుండగా గుండెనొప్పిగా ఉందని చెప్పి అలాగే కుప్పకూలిపోయినట్లు ఉపాధి కూలీలు తెలిపారు. ఆసుపత్రికి తీసుకువెళ్లే సమయం కూడా లేదని నిమిషాల వ్యవధిలో ఆమె ప్రాణాలు విడిచినట్లు తెలియజేశారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు, భర్త ఉన్నారు.

ఫుల్లరిన్ వెలికితీతపై నీలినీడలు

● ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది ● నిక్షేపం వెలికితీతపై పట్టించుకోని ప్రభుత్వం
● వెలికి తీస్తే ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం



ఫుల్లరిన్ నిక్షేపం నమూనా

రాజంపేట, మే 17: ప్రపంచంలోనే వజ్ర వైడూర్యాల కంటే విలువైనది ఫుల్లరిన్ నిక్షేపం. ఇది చాలా అరుదుగా లభిస్తుంది. 10 గ్రాముల బంగారం రూ.70 వేలు అయితే అదే 10 గ్రాముల ఫుల్లరిన్ రూ.30 లక్షలకు పైబడి విలువ పలుకుతుంది. దూది కంటే అత్యంత తేలికగా ఉండే ఈ ఖనిజం వెంట్రుకవాసి కూడా అంటే నానోమీటర్ కూడా అందని కంటికి కూడా కనిపించని ఎంతో విలువైన ఖనిజం. అయితే ఉక్కు కంటే 250 రెట్లు ఈ ఖనిజం ధృఢంగా ఉంటుంది. బంగారం కంటే 150 రెట్లు విలువ ఉంటుంది. ఇది ప్రధానంగా అంతరిక్ష పరిశోధనలకు, ఎయిడ్స్, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడటానికి ఓ ఔషధానికి ఈ నిక్షేపాన్ని వాడతారు. అంతేకాక విమానాలు విహరించే సమయంలో పిడుగుపాటుకు గురి కాకుండా విమానంపై ఫుల్లరిన్ రేణువులను పూస్తారు. ప్రముఖులకు ప్రాణరక్షణ కల్పించడానికి బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లకు కూడా దీనిని వినియోగిస్తారు. ఈ విలువైన ఖనిజాన్ని ఎలాగైనా వెలికితీయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందుకెళుతున్నట్లు తెలుస్తోంది. అత్యంత విలువైన ఈ ఫుల్లరిన్‌ను శాస్త్రీయంగా మంగంపేట ఏపీఎండీసీ మైన్స్‌లో లభిస్తుందని నిర్ధారణ కావడంతో గతంలో దీనిని ఎలా అయినా వెలికితీయాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి కసరత్తు చేసినా పెద్దగా విజయం సాధించలేకపోయింది.

ఓబులవారిపల్లె మండలం మంగంపేట ముగ్గురాళ్ల వ్యర్థాల నుంచి ప్రపంచంలో బంగారం కంటే అతి ఖరీదైన ఫుల్లరిన్ నిక్షేపాన్ని వెలికి తీయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం 20 ఏళ్లుగా వాయిదా పడుతూనే ఉంది. 18 ఏళ్ల కిందట ఫుల్లరిన్ నిక్షేపాన్ని వెలికితీయాలని, తద్వారా వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలన్న ప్రభుత్వ నిర్ణయం సఫలం కాలేదు. ఏపీఎండీసీ ఆధ్వర్యంలో నడిచే మంగంపేట ముగ్గురాళ్ల వ్యర్థాలలో ఫుల్లరిన్ నిక్షేపాలున్నాయని నిపుణులు తెలియజేశారు. 2017లో ఈ ఖనిజాన్ని వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు కూడా చేపట్టింది. దేశంలోనే పేరెన్నికగన్న జంషెడ్‌పూర్ జాతీయ మినరల్స్ పరిశోధనా సంస్థకు ఈ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. కానీ కొన్ని కారణాల వల్ల అది మరుగునపడిపోయింది. ఆ తరువాత దీనిపై జగన్ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు.

ప్రపంచంలో రష్యా దేశంలోని శృంగైట్ స్టోన్స్‌లో ఫుల్లరిన్ నిక్షేపం లభిస్తోంది. ఈ అత్యంత ఖరీదైన నిక్షేపాన్ని వెలికితీయడానికి చైనా దేశం అనేక విధాలుగా ప్రయత్నించినా ప్రయోజనం లేకుండాపోయింది. అయితే ఇది మంగంపేట ఏపీఎండీసీ గనుల్లో ఉన్నట్లు గతంలోనే భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తలు తేల్చారు. మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో సుమారు 35 సంవత్సరాలుగా 12 కోట్ల టన్నుల ముగ్గురాయి నిక్షేపాల వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి ఉన్నాయి. ఈ వ్యర్థాల నిక్షేపాలు మంగంపేట చుట్టూ పెద్ద పెద్ద కొండల వలే పోసి ఉన్నారు. ఆ వ్యర్థాల ద్వారా ఫుల్లరిన్ నిక్షేపాన్ని కనుగొన్నారు. 1000 టన్నుల వ్యర్థాలను క్రషింగ్ చేస్తే ఒక కేజీ వరకు ఫుల్లరిన్ లభిస్తుందన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. గతంలో ఎస్వీ యూనివర్సిటీ జియాలజీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన పరిశోధకులు దీనిపై మంగంపేటలో పరిశోధనలు చేసి ఇక్కడ ఖరీదైన ఫుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు కనుగొన్నారు.

2005వ సంవత్సరంలో ఈ విషయం బట్టబయలైనా నిక్షేపం వెలికితీత అంశం ఎంతో ఖర్చుతో కూడుకున్న పనితో పాటు సాధ్యాసాధ్యాలను పరిగణలోకి తీసుకొని ఈ అంశాన్ని పక్కన పెట్టారు. ప్రస్తుతం మంగంపేట బెరైటీస్ ఖనిజాలను అంతర్జాతీయ స్థాయిలో విక్రయించడానికి టెండర్లను పిలుస్తున్నా అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి అంత డిమాండ్ ఉండటం లేదు. ఇతర దేశాల్లో నాణ్యమైన బెరైటీస్ ఖనిజాన్ని తక్కువ రేట్లతో ఇస్తున్నారు. దీనివల్ల మన ఖనిజానికి పెద్ద డిమాండ్ లేదు. ఈ సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంగంపేట ఏపీఎండీసీ అధికారులతో సంప్రదించి ఫుల్లరిన్ వెలికితీతపై దృష్టి పెట్టినా అది సాధ్యం కాలేదు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం దీనిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఫుల్లరిన్ నిక్షేపాలను వెలికితీసి ఉంటే మంగంపేటలో 12 కోట్ల టన్నుల బెరైటీస్ వ్యర్థాల నుంచి ఫుల్లరిన్‌ను వెలికి తీస్తే వేల కోట్ల ఆదాయం గణనీయంగా పెరిగేది. ఈ ఖనిజం వెలికితీతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తే మంగంపేట ఏపీఎండీసీ ముగ్గురాయి గనులకు ప్రపంచ స్థాయిలోనే గుర్తింపు రావడమే కాక వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చి ఉండేది. ఈ విషయమై ఏపీఎండీసీ అధికారులను వివరణ కోసం ప్రయత్నించగా ఇందుకు సంబంధించిన అధికారులు అందుబాటులో లేరు.



మంగంపేటలోని ఏపీఎండీసీ బెరైటీస్ మైన్స్

ఫుల్లరిన్ నిక్షేపాలు ఉండేది ఈ మంగంపేట ముగ్గురాళ్ల వ్యర్థాల గుట్టల్లోనే..



జేఎన్టీయూ బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, మే 17: పులివెందుల జేఎన్టీయూ బీటెక్ రెండవ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఫలితాల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి/ఏప్రిల్-2024 నెలలో నిర్వహించిన నాల్గవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, మొదటి, రెండవ, మూడవ, నాలుగు సంవత్సరాల రెండవ సెమిస్టర్ (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలతో పాటు మొదటి, రెండవ, మూడు సంవత్సరాల (ఆర్20) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూర్యనారాయణరెడ్డి, పరీక్ష కేంద్ర విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల క్రికెట్ ట్రయల్స్‌కు 85 మంది హాజరు



సెలక్షన్స్‌లో బౌలింగ్ వేస్తున్న క్రీడాకారిణి

కడప (స్పోర్ట్స్) మే 17: జిల్లా క్రికెట్ సంఘం సారథ్యంలో శుక్రవారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సీనియర్స్ అండర్-23, అండర్-19 బాలికల క్రికెట్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 85 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారిణులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎల్.మునికుమార్‌రెడ్డి, విష్ణుమోహన్, శివప్రసాద్, ఏసీఏ సౌత్‌జోన్ హెడ్ కోచ్ పి.మధుసూదన్‌రెడ్డి, సీఏవైడీ కోచ్‌లు ఎస్.ఇలియాస్, షేక్ అబూబకర్ హాజరయ్యారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి గురుపూజ





దీక్షాబంధనాలంకారంలో బ్రహ్మంగారు, స్వామి దర్శనం కోసం క్యూలైనులో భక్తులు

బ్రహ్మంగారిమఠం, మే 17 : పోతులూరి వీరబ్రహ్మంగారి ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినం కావడంతో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు క్యూలైనులో చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఉదయం నుంచి మఠాధిపతుల నివాసం మందిరంలో మాలధారణ వేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లలో నామస్మరణలతో మారుమ్రోగింది. మాలధారణ చేసిన భక్తులు పీఠాధిపతుల మందిరంలో మాలను విరమించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైను ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం యాజమాన్యం క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. భోజన వసతి, తాగునీరు, విశ్రాంతి భవనాలు సౌకర్యాలను కల్పించారు. అలాగే ఉత్సవాల ప్రత్యేక అధికారి నోడల్ అధికారి యదుభూషణ్‌రెడ్డి ఉత్సవా లను పర్యవేక్షించారు. రాత్రికి భక్తులు జాగారం ఉండడంతో అధిక సంఖ్యలో బి.మఠానికి చేరుకోనున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు అసిస్టెంటు కమిషనర్ శంకరబాలాజీ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ పరిపాలనాధికారిగా రవికుమార్



నియామకపత్రం అందుకుంటున్న రవికుమార్

జమ్మలమడుగు/ వేంపల్లె, మే 17: జమ్మలమడుగు పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెనుగొండ రవికుమార్‌ను శుక్రవారం ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ నూతన పరిపాలన అధికారిగా నియమించినట్లుగా ఆయన తెలిపారు. డాక్టర్ పెనుగొండ రవి కుమార్ అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన జపాన్ యూనివర్సిటీ ఆఫ్ అయిజులో పీహెచ్‌డీ పూర్తి చేసి ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలి


జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య




మొబైల్ ఫోన్స్ పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

రాయచోటిటౌన్, మే 17: నూతనంగా విధుల్లో చేరిన ఆశా వర్కర్లకు ప్రభుత్వం అందజేసిన మొబైల్స్ ఫోన్స్ ద్వారా వైద్య ఆరోగ్య సేవల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కొత్తగా విధుల్లో చేరిన ఆశా కార్యకర్తలకు కొత్త సెల్‌ఫోన్స్ సిమ్ కార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవడం ద్వారా తల్లి, బిడ్డలకు, సమాజానికి మెరుగైన వైద్య సేవలందించవచ్చన్నారు. ఆశాకార్యకర్తలు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడం ద్వారా పేద ప్రజలకు, ఆరోగ్యశాఖకు వారధులుగా నిలిచి మంచి గుర్తింపు, పేరు తెచ్చుకోవాలని ఆదేశించారు. అనంతరం డిప్యూటీ డెమో దేవశిరోమణి మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు అన్ని ఆరోగ్య కార్యక్రమాలతో పాటు పీసీపీఎన్, డీటీ చట్టం గురించి ఆడబిడ్డల నిష్పత్తి తగ్గితే కలిగే నష్టం గురించి సమాజానికి, తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో ఓబుల్‌రెడ్డి, ఆశా జిల్లా నోడల్ అధికారి సుగుణ, విజయ్‌కుమార్, జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నుంచి వచ్చిన నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

రాయచోటిటౌన్, మే 17: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్యస్వాముల వేదమంత్రోచ్ఛరణల మధ్య భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలను చేపట్టారు.

ఈ సందర్భంగా రాయచోటి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆలయ అర్చకులు రాహుకాల పూజల విశిష్టత గురించి భక్తులకు వివరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



పసిడిపురి పీఠం

దక్కేదెవరికి?

- బూత్‌ల వారీగా లెక్కలు వేస్తున్న అభ్యర్థులు
- మెజారిటీ వస్తుందన్న ధీమాతో వరద
- గెలుపు తనదే అనుకుంటున్న రాచమల్లు









ప్రొద్దుటూరు, మే 17: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి అప్పుడే ఐదురోజులు గడిచింది. వైసీపీ, ఎన్డీయే కూటమి మధ్య యుద్ధంలా సాగిన ఈ ఎన్నికలతో రాష్ట్రంలో పలుచోట్ల అల్లర్లు ఘర్షణలు చెలరేగిపోతున్నాయి. కడప జిల్లాలో చెదురుమదురు ఘటనలు తప్ప పెద్దఎత్తున హింస జరగలేదు. శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకు గాను 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో మాత్రం వైసీపీకి ఎదురుగాలి తప్పదని ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో కనీసం ఐదుచోట్ల వైసీపీకి భంగపాటు తప్పదని అంటున్నారు. ఇందులో ప్రొద్దుటూరు ముందువరుసలో ఉందని పోలింగ్ సరళిని బట్టి అంచనాలు వేస్తున్నారు.

ఆది నుంచి పెద్దాయనకు

అనుకూల పవనాలు

ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్టు ప్రకటించక ముందునుంచే పెద్దాయన వరదరాజులరెడ్డికి టిక్కెట్టు వస్తే గెలుపు ఖాయం అనే ప్రచారం ప్రజల్లో పెద్దఎత్తున ఉంది. అందులో భాగంగా చంద్రబాబునాయుడు కూడా ప్రొద్దుటూరులో టీడీపీ టికెట్టు రేసులో నలుగురు ఉన్నప్పటికీ సర్వేల ఆధారంగా పెద్దాయనకే టికెట్టు ప్రకటించారు. టికెట్టు ప్రకటించక ముందునుంచే ఆయన పార్టీ కార్యక్రమాలను చురుకుగా ముందుకు తీసుకువెళ్లారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీతో పాటు ఇతర పార్టీ కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి అక్రమాలపై కూడా ప్రత్యక్ష పోరాటం చేశారు. దీంతో రాచమల్లుకు పెద్దాయనే సాటి అని.. శిష్యుడి దూకుడుకు గురువే ముకుతాడు వేయగలడనే ప్రచారం ప్రజల్లో వ్యక్తమైంది. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ఆయన కుటుంబ సభ్యులు గత ఐదేళ్లలో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు, భూదందాలతో ప్రజలు విసుగుచెందారు. ప్రశాంతంగా ఉన్న ప్రొద్దుటూరులో భయానక రోజులు రావడం.. ఎవరూ ధైర్యం చేసి వారి అరాచకాలను ప్రశ్నించలేని వాతావరణం ఏర్పడింది. దీంతో పెద్దాయన వరదరాజులరెడ్డి రావాలని రాచమల్లును దీటుగా ఎదుర్కోగల సత్తా ఆయనకే ఉందని భావించారు.

రాచమల్లుకు భంగపాటు తప్పదనే ప్రచారం

పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డిపై సహజంగానే వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అయితే మొదటిసారి ఆయన ఎమ్మెల్యే అయినప్పుడు వైసీపీ అధికారంలో లేదు. అందువల్ల ఆయన అభివృద్ధి చేయలేక పోయాడని ప్రజలు భావించారు. కానీ రెండోసారి జగన్ గాలిలో భారీ మెజార్టీతో రాచమల్లును ప్రజలు గెలిపించారు. బీసీ వార్డుల్లో ముఖ్యంగా చేనేతల వార్డులలో ఆ సామాజిక వర్గాలు ఓట్లు వేయలేదని రాచమల్లు వారిని విమర్శించారు. దీంతో బీసీలు, చేనేతలు ఓట్లు వేయకుంటే అంత మెజార్టీతో ఆయన గెలిచేవాడా అని ప్రజలు చర్చించుకున్నారు. రాచమల్లు రెండవ సారి తాను అధికారంలోకి వస్తే జగన్ మంత్రి పదవి ఇచ్చినా త్యాగం చేసి ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ఏడాదికి రూ.500 కోట్ల వంతున ఐదేళ్లలో రూ.2500 కోట్ల నిధులతో ప్రొద్దుటూరు రూపురేఖలే మార్చుతానని లేకుంటే వచ్చే ఎన్నికల్లో ముఖం చూపనని అప్పట్లో హామీ ఇచ్చారు. కానీ ఐదేళ్లలో ఆయన ప్రభుత్వంలో జగన్ ఇచ్చిన నిధులు కేవలం రూ.500 కోట్లు. 13 అభివృద్ధి పనులకు జగన్ శంకుస్థాపన చేసినా వాటికి బిల్లులు మాత్రం రాలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. రెండుసెంట్ల స్థలం, ఉచితంగా ఇల్లు నిర్మించి పట్టా తాళాలు ఇచ్చే హామీని కూడా రాచమల్లు నెరవేర్చలేకపోయారు. ఆవాసానికి పనికిరాని భూములలో సెంటు స్థలం ఇచ్చి అదే గొప్ప అనే రీతిలో ప్రచారం చేసుకున్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదు. కేవలం గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు అయిన అమృత్ స్కీం ఈ ప్రభుత్వంలో పూర్తయింది. దీంతో ఈ పర్యాయం రాచమల్లుకు భంగపాటు తప్పదనే ప్రచారం మొదటి నుంచీ సాగుతోంది.

సర్వశక్తులు ఒడ్డిన రాచమల్లు

2024 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలనుకోవడంతో ఆయనకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. రాచమల్లు మూడోసారి గెలవడానికి సర్వశక్తులు ఒడ్డి పోరాడారు. కులాల వారీగా ఆత్మీయ సమావేశాలు, భారీగా విందు భోజనాలు పెట్టి హామీలను గుప్పించారు. పకడ్బందీగా ప్రచారంతో పాటు ఎలక్షన్‌లో డబ్బులను విచ్చలవిడిగా ఖర్చుచేశారు. ఓట్లకు ప్రతిపక్షాలకంటే అధికంగా డబ్బులు పంచారు. దీంతో ఆయన గెలుపుపై పూర్తి ధీమాతో ఉన్నారు. అంతేకాకుండా పోలింగ్ సరళిని బూతుల స్థాయిలో అంచనా వేశారు. మహిళలు అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నందున వైసీపీకి ఆ ఓట్లు జగన్ పథ కాల వల్ల పడ్డాయని భావిస్తున్నారు. గ్రామాల్లో సైతం పెద్ద ఎత్తున ఓటింగ్ శాతం పెరగటంపై వైసీపీ ఆశలు చిగురించాయి. వ్యతిరేకత మామూలే అని అదంతా అన్ని స్థాయిల్లో పనిచేయదని లెక్కలు వేస్తున్నారు. అయితే గతంలోలా మెజారిటీపై బీరాలకు పోవడంలేదు. గెలుపుపై మాత్రమే కార్యకర్తలకు హామీ ఇస్తున్నారు.

వరదకు స్వల్ప మెజారిటీ వచ్చే

అవకాశం

పోలింగ్ ముగిసి నాలుగురోజులు అయింది. వరద వర్గం గెలుపుపై పూర్తి స్థాయి ధీమాలో ఉన్నారు. స్వల్ప మెజారిటీ రావచ్చని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఓటింగ్ గత 2019 ఎన్నికల కంటే రెండు శాతం పెరగడం, పైగా మహిళా ఓటర్లు పురుషులకంటే ఏడువేల మంది అధికంగా పాల్గొనడంపై అందరిలో చర్చ సాగుతోంది. మహిళా ఓటర్లు చంద్రబాబు పథకాలకు స్పందించారని అంటున్నారు. రూ.4వేలకు పెన్షన్ పెంపు, 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం, మూడు గ్యాస్‌సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీలపై మహిళలు ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగటం.. టీడీపీకి కొన్ని గ్రామాల్లో పట్టు ఉండటంతో అది తమకే లాభిస్తుందని నేతలు భావిస్తున్నారు. ఏదిఏమైనా ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓటర్ల తీర్పు, అభ్యర్థుల భవితవ్యం కోసం ఇంకా రెండువారాలకు పైగా ఉత్కంఠ తప్పదు.

పొట్టకూటి కోసం వెళ్తూ పరలోకానికి...



మృతిచెందిన కడప బాషా

రామాపురం, మే 17: పొట్టకూటి కోసం వెళ్తూ మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెలో చోటు చేసుకుంది.

సదరు గ్రామానికి చెందిన కడప బాషా (56) బతుకుదెరువు నిమిత్తం ప్రతిరోజు చింతచిగురు కోసుకొని కడప మార్కెట్‌లో విక్రయించి జీవనం సాగిస్తూ ఉండేవాడని, రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల మధ్యలో బైక్‌పైన చింతాకు తీసుకొని మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో సీకే దిన్నె మండలం మూలవంక పెట్రోల్ బంకు వద్ద బైక్ కిందపడి తలకు బలమైన గాయమైంది. 108 ద్వారా రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాల్లో ఉంది. భర్త మరణ వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కువైత్ నుంచి స్వగృహానికి బయలుదేరిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాషా మృతిచెందిన సంఘటనతో కర్ణపువాండ్లపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవ కేసులో

ముగ్గురికి రిమాండ్

చాపాడు, మే 17: మండలంలోని చిన్నగురవలూరు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 13న సోమవారం ఎన్నికల సందర్భంగా ఆ గ్రామంలో టీడీపీ ఏజెంట్లు అయిన ఉగ్రనరసింహులు, వినోద్‌కుమార్‌లను వీరు కొట్టి గాయపరిచారన్నారు. అరెస్టు చేసిన వారిలో నగిలి చంద్ర, రాఘవరెడ్డి, రాము ఉన్నారు. ఇప్పటికే ఎనిమిది మందికి రిమాండ్ విధించినట్లు వారు పేర్కొన్నారు.

రక్తపోటును కచ్చితంగా నిర్ధారించాలి..

కడప (కలెక్టరేట్), మే 17 : ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ప్రతి ఒక్కరికీ రక్త పోటును కచ్చితంగా నిర్ధారించి, అదుపులో ఉంచుకునేందుకు జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు రక్తపోటుతో కలిగే దుష్పరిణామాలు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. మన దేశంలో 30 శాతం మంది రక్తపోటు వ్యాధితో బాధపడుతున్నారన్నారు. అధిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు నియంత్రణలో లేకపోవడంతో ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం నెలకు ఒకసారైనా రక్తపోటును పరీక్షించుకోవాలన్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. 30 ఏళ్లు దాటిన వారందరికీ ఎన్సిడి 2.0లో హైపర్ టెన్షన్, డయాబెటిస్ స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమ మహేశ్వరకుమార్, డాక్టర్లు రమేష్, సునీత, జిల్లా మలేరియా అధికారిణి మనోరమ, డెమో భారతి, డిప్యూటీ డెమో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


రేపు ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

- *జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ*

రాయచోటిటౌన్, మే 17: ఎయిడ్స్ వ్యాధితో తమ జీవితాలను కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఈ నెల 19న అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించబడుతుందని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం మే నెల మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధితో ఎంతో మంది ప్రాణాలు, జీవితాలను కోల్పోయారని, వారి జ్ఞాపకార్థం హెచ్‌ఐవీతో జీవిస్తున్న ప్రజలకు సహాయం చేయడానికి తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలను గుర్తించడం కోసం, సమాజంలో హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఏడు బర్రెలు మృతి



బి.కోడూరు, మే 17 : మండల పరిధిలోని టమటంవారిపల్లె గ్రామానికి చెందిన మడతల సుబ్బలక్షుమ్మకు సంబంధించిన నాలుగు బర్రెలు ద్వారకచర్ల రమాదేవికి చెందిన రెండు బర్రెలు, బొల్ల గుర్విరెడ్డికి చెందిన ఒక బర్రె విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాయి. బర్రెలను శుక్రవారం ఉదయం మేసేందుకు పుల్లీడు గ్రామ పొలాల్లో తోలి వచ్చామని, అక్కడ 11కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని వాపోయారు. వాటి విలువ దాదాపు రూ.5లక్షల మేర అవుతాయని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐదుగురిపై కిడ్నాప్ కేసు

ముద్దనూరు మే 17: రెండు గ్రూపుల మధ్య జరుగుతున్న గొడవలో భాగంగా జిలాని(సాయి)అనే యువకుడి కిడ్నాప్‌నకు సంబంధించి ఐదుగురి పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.సీఐ సమాచారం మేరకు వివరాలు...జిలాని(సాయి)శ్రీధర్(బాబి)రెండు గ్రూపుల మధ్య దాదాపు 3నెలలుగా ఘర్షణ జరుగుతోంది. కాగాగురువారం బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జిలానీ గ్రూపు, శ్రీధర్ గ్రూపు మధ్య ఘర్షణ జరిగింది.అదే రోజు సాయంత్రం జిలాని అతని స్నేహితుడు జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో హోటల్ వద్ద ఉండగా శ్రీధర్ అతని గ్రూపుతో వచ్చి జిలానీని కారులో కిడ్నాప్ చేశారు. బొందలకుంట సమీపంలోని తారు ప్లాంట్ వద్ద చితకబాది వదిలేశారు.వెంటనే జిలానీ స్నేహితుడు అక్కడికి చేరుకొని జిలానీని ప్రథమ చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితుడు జిలాని ఫిర్యాదు మేరకు శ్రీధర్(బాబి), జగదీష్,బడుగు దుద్దురాజా,సుమంత్(సన్నీ) రవికుమార్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హిజ్రా అనుమానాస్పద మృతి కేసు నమోదు

చిన్నమండెం, మే 17: మండలంలోని కేశాపురం జామాయిల్ చెట్ల వద్ద అనుమానాస్పదంగా గణేశ్ (హిజ్రా) మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం, నడిమికండ్రికకు చెందిన గణేశ్ (హిజ్రా) 25 సంవత్సరాలు కేశాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టమోటు అంజనేయస్వామి గుడి వెనుక అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఉరివేసుకొని మృతిచెందింది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి విచ్చేసిన పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. అయితే మృతురాలు అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నేడు వాసవి జయంతి ఉత్సవాలు



పూజలందుకొంటున్న కన్యకా పరమేశ్వరిదేవి

రామాపురం, మే 17: మండలంలోని నీలకంఠావుపేట ఆశ్రమంలో వెలిసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం నుంచి వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు ప్రార్థన, గణపతిపూజ, స్వస్తి వాచకం, అమ్మవారికి పంచామృతాభిషేకం, మంగళహారతి, కుంకుమార్చన మొదలైన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం, మే 17: మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ మాండవ్యనది ఒడ్డున వెలిసిన మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, నైవేద్యాలు సమర్పించారు. వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్

దిక్కూ మొక్కూ లేని జగనన్న కాలనీలు



నూలివీడులో గునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ

- మౌలిక సదుపాయాలు కరువు
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- నిర్మాణాలకు ఆసక్తి చూపని లబ్ధిదారులు

గాలివీడు, మే 17: ఇంటి నిర్మాణాలకు వ్యయం భారీగా పెరిగిపోయింది. సాధారణ ప్రజలు ఇంటి నిర్మాణాలను చేపట్టాలంటే భయపడి పోతున్నారు. ప్రభుత్వం అందజేసే అరకొర సాయం భవన నిర్మాణాలకు ఏ మూలకు సరిపోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చే సహాయంపై ఇంటి నిర్మాణాలు చేపడితే అప్పుల పాలైపోతాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జగనన్న కాలనీలు నిర్మాణాలకు నోచుకోక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దిక్కు మొక్కు లేకుండా పోయాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 20 జగనన్న కాలనీలు కలవు. ఇందులో అరవీడు పంచాయతీలో మలసానివాండ్లపల్లె 71 ఇళ్లు, ఎగువ గొట్టివీడు 3 ఇళ్లు, గాలివీడు పంచాయతీలో ప్రాజెక్టు సమీపంలో 84 ఇళ్లు, బలిజపల్లె 24 ఇళ్లు, అరవీటివాండ్లపల్లె 48 ఇళ్లు, గాలివీడు సమీపంలో 87 ఇళ్లు, గరుగుపల్లె పంచాయతీలోని కస్పాలో 6, గుండ్లచెరువు పంచాయతీలో 4, కొర్లకుంట పంచాయతీలోని చావిడిపల్లెలో 39, నూలివీడు పంచాయతీలో 2, ఆవులవాండ్లపల్లె సమీపంలో 27, వడ్లపల్లెకు సమీపంలో 22, పందికుంట పంచాయతీ, తలముడిపిలో 3, తూముకుంటలో 6, వెలిగల్లులో 3 జగనన్న కాలనీల్లో 124 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 126 గృహాలు ఇంతవరకు నిర్మాణాలకు నోచుకోలేదు. 242 ఇళ్లు గునాదులకే పరిమితం కాగా, 46 ఇళ్లు గోడల వరకు, మరో 42 ఇళ్లు మోల్డింగ్ వరకు పూర్తయ్యాయి. మొత్తం మండలంలో అన్ని జగనన్న కాలనీల్లో 558 ఇళ్లు మంజూరు కాగా కేవలం 52 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.



అరవీడులో మౌలిక సదుపాయాలు లేని జగనన్న కాలనీ

అరకొర వసతుల్లో కాలనీలు

జగనన్న కాలనీలు అన్ని గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఏ కాలనీల్లో కూడా విద్యుత్ సౌకర్యం కల్పించకపోగా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి కొరత ఎక్కువగా ఉన్నది. పూలకుంట, ఆవులరెడ్డిగారిపల్లె, బత్తినవాండ్లపల్లె, రామిరెడ్డిగారిపల్లె, గరుగుపల్లెలో ఒకటి, రెండు తప్ప ఇంతవరకు ఇంటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఇక్కడ ఉన్న స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచాయి. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి నిర్మాణాలకు ఖర్చులు పెరిగిపోయాయని, ప్రభుత్వం ఇచ్చే సమయం ఏ మూలకు సరిపోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు అందజేస్తున్నదని, కానీ ప్రస్తుతం ధరలు పెరిగినందున రూ.4 లక్షలు ఖర్చవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంటి నిర్మాణాలు చేపడితే అప్పులు పాలుకాక తప్పదని లబోదిబోమంటున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ సమేతులైన సీతారాములు

పుల్లంపేట, మే 17: మండల పరిధిలోని కొమానుపల్లి హరిజనవాడలో శుక్రవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు.

కోడూరులో చిరుజల్లులు



ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు

రైల్వేకోడూరు, మే 17: ఇటీవల విపరీతంగా ఎండలు, ఉక్కపోత, గాలి లేక ప్రజలు అల్లాడిపోయారు. పట్టణంలో శుక్రవారం చిరుజల్లులు పడటంతో వీధుల్లోని పిల్లలు వర్షానికి తడుస్తూ ఎంజాయ్ చేశారు. వివిధ రకాల ఆటలు ఆడుకున్నారు. కోడూరులో వాతావరణం చల్లబడడంతో వృద్ధులు, చిన్నారులు ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా గంగమ్మతల్లి నిమజ్జనం



గంగమ్మను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రైల్వేకోడూరు, మే 17: పట్టణంలో గురువారం గంగమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం గంగమ్మ తల్లిని ఘనంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మొదటిగా గంగమ్మకు దున్నపోతులను సమర్పించారు. తర్వాత ప్రత్యేక పల్లకిలో గంగమ్మతల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు రంగులు చల్లుకుని సంతోషంగా గడిపారు. దీంతో జాతర కార్యక్రమాలు ముగిశాయి.

ఉపాధి కూలీలకు కూలి రూ.600 పెంచాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మణి



ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పండుగోల మణి

రైల్వేకోడూరు, మే 17: ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600లు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి డిమాండు చేశారు. శుక్రవారం మండలంలోని ఓబనపల్లె, సింగిరివారిపల్లె గ్రామాల్లో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద కూలీలకు కొలతలతో పని లేకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రోజువారి కూలీగా రూ.600లు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఎండాకాలంలో కూలీలకు వడదెబ్బ తగలకుండా షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. ఐదు కి.మీ. దూరం పైబడి పనిచేసే చోటకు ట్రావెలింగ్ డబ్బులు ఇవ్వాలని డిమాండు చేశారు. కూలీలు పనిచేసేప్పుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.20లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి జ్యోతి ఉత్సవాలు



లక్కిరెడ్డిపల్లె, మే 17: మండలంలోని కోనంపేట గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి దేవికి శుక్రవారం నుంచి సోమవారం వరకు జ్యోతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజున చౌడేశ్వరిదేవికి 108 బిందెలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శనివారం పుష్పాండ మహర్షి పీఠాధిపతులు దివ్యానంద గిరి స్వాములచే జ్యోతిర్లింగ అలంకరణ ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

ఆరోగ్య సేవలో ఆశావర్కర్ల పాత్ర కీలకం

- డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, మే 17: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఆరోగ్య సేవలను అందజేయడంలో ఆశావర్కర్ల పాత్ర చాలా కీలకమైందని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా పర్యవేక్షణ అధికారి (డీపీయంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జరిగిన నెలవారీ ఆశా నోడల్ అధికారుల సమక్షంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందించేందుకు ఆశాలు మూల స్తంభాలుగా నిలుస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. వయోజన టీబీ టీకా కార్యక్రమంలో ఆశాలు లబ్ధిదారులను గుర్తించి టీకాకు ప్రోత్సహించి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు తీసుకొచ్చి వేయిస్తున్నారని తెలిపారు. నూతనంగా నియమించబడిన ఆశాకార్యకర్తలకు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డ్స్ యూనిఫామ్‌లు కూడా పంపిణీ చేశారన్నారు. ఆశా నోడల్ అధికారులు రోజు వారీ ఆశాల పనితీరు పర్యవేక్షిస్తూ వారికి ఇచ్చిన ట్యాబ్‌లలో రోజు లాగిన్ అయి వారు అందించే సేవలు అప్డేట్ చేసే విధంగా వారికి తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆశానోడల్ అధికారులకు జిల్లా కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుగుణ, సీహెచ్‌వో నారాయణ, ఈపీ డేమెలాజిస్ట్ వెంకటేశ్, డీపీవో మునీశ్వర్, డీఎస్‌వో కరీముల్లా, జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల ఆశా నోడల్ అధికారులు హాజరయ్యారు.

టీడీపీ కార్యకర్తపై.. వైసీపీ కార్యకర్తల దాడి



దాడిలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త చిన్నప్ప

చిన్నమండెం, మే 17: గత 30 సంవత్సరాలుగా టీడీపీ కోసం నిరంతరం నిస్వార్థంగా సేవలం దిస్తూ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్న మల్లూరు గ్రామానికి చెందిన చిన్నప్పపై కొందరు వైసీపీ కార్యకర్తలు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని బాధితుడు ఆరోపిస్తున్నారు. స్థానికుల వివరాల మేరకు.. చిన్నప్ప ఇంటికి వస్తున్న తాగునీటి పైపులైన్‌ను అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శివారెడ్డి అతని అనుచరులు కట్ చేశారు. దీంతో చిన్నప్ప ఎందుకు కట్ చేశారని ప్రశ్నిస్తుండగానే వారందరూ మూకుమ్మడిగా దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. ఇంటిపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించారని వివరించారు. దాడిలో గాయపడ్డ బాధితుడుని కుటుంబ సభ్యులు వెంటనే రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడికి తలపై రక్త గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ అక్కడున్న వాటర్‌ట్యాంక్‌కు ప్రతి ఒక్కరూ పైపులైన్ డైరెక్ట్‌గా పెట్టడంతో నీటి సమస్య చాలా రోజుల నుంచి ఉందని, తమ దృష్టికి కూడా ఈ సమస్య వచ్చినట్లు తెలిపారు. అయితే శుక్రవారం వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేశామని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, చాలా రోజుల నుంచి సమస్య ఉండగా.. పట్టించుకోని అధికారులు ఘర్షణ జరిగిన తర్వాత స్పందించడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందే స్పందించి ఉంటే ఈ గొడవలు జరిగేవి కాదని చెబుతున్నారు. కాగా ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట

- ఇసుక తవ్వకాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారులు





గొడవలు జరగకుండా పోలీసుల గస్తీ, (ఇన్‌సెట్లో) ఇసుక అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన హిటాచీలు

సిద్దవటం, మే 17: జంగాలపల్లె ఇసుక క్వారీలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా పెన్నానది నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో జిల్లా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు తహశీల్దారు మురాద్వావల్లీ ఉత్తర్వుల మేరకు ఇసుక రవాణా నిలుపుదల చేశామని సిద్దవటం వీఆర్వో కేశవులు తెలియజేశారు. ఇసుక నింపుతున్న హిటాచీ యంత్రాలను పెన్నానది నుంచి బయటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. జంగాలపల్లె పెన్నానదిలో ఇసుక రవాణా అనుమతులు లేవని ఒంటిమిట్ట మండలం దర్జీపల్లె పెన్నానదిలో తవ్వకాలు జరపకుండా జంగాలపల్లె గ్రామ పంచాయతీలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఉన్నతాధికారుల ఆదేశాలతో నిలుపుదల చేశామని తెలిపారు. మండల తహశీల్దారు ఆదేశాలతో పోలీస్‌స్టేషన్‌కు అప్పగిస్తామని ఆయన అన్నారు. కాగా మరోసారి ఇలా జరగకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికాలో మాస్టర్ డిగ్రీ అందుకున్న నిఖిత



పట్టా తీసుకున్న ఆనందంలో తల్లిదండ్రులతో నిఖిత

రైల్వేకోడూరు, మే 17: రైల్వేకోడూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, షర్మిల కుమార్తె నిఖిత అమెరికాలో కంప్యూటర్ సైన్సులో మాస్టర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కోర్సు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్కడి కార్నిజి మెల్లాన్ యూనివర్శిటీ, పిట్టస్‌బర్గ్‌లో యూనివర్శిటీ బృందం మాస్టర్ డిగ్రీ పట్టాను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి నిఖిత తల్లిదండ్రులు అమెరికా వెళ్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాచినేని విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ తన కుమార్తె అమెరికాలో కంప్యూటర్స్ సైన్సులో మాస్టర్ డిగ్రీ పొందడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. న్యూజెర్సీలోని న్యూబిస్ కమ్యూనికేషన్స్ సంస్థలో ఏడాదికి రూ.1,42,00000 ప్యాకేజీతో ఉద్యోగం కూడా లభించిందని తెలిపారు. తన కుమార్తెకు ఇంత ఖ్యాతి పొందడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు.

ఘర్షణలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పెద్దఓబన్న

సిద్దవటం, మే 17: గ్రామాల్లో ప్రజలు ఘర్షణలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ చేస్తామని ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. మండలంలోని వెంకటాయపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామ ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్‌పోల్ (ఎలక్షన్ తరువాత) జరుగు సంఘటనలు దృష్టిలో ఉంచుకొని ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు రిజిష్టర్ చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. అటువంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో రాజకీయపరంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

వేడుకగా కొత్తపురమ్మ ఊరేగింపు





ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు, (ఇన్‌సెట్లో) పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలు

సంబేపల్లె, మే 17: దుద్యాల గ్రామ దేవత కొత్తపురమ్మ తల్లి ఈ నెల 25న జాతర సందర్భంగా ఊరేగింపు కార్యక్రమాన్ని జాతర ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి శుక్రవారం స్థానిక ప్రజలతో కలిసి నిర్వహించారు. పెద్దజంగంపల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. యువత ఉత్సాహంగా కేరింతలు కొడుతూ అమ్మవారి పల్లకిని మోశారు. పురవీదుల్లో మహిళలు అమ్మవారికి నీరు ఆరబోసి ప్రతి ఇంట కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఈ నెల 25వ తేదీ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ అమ్మవారి జాతరలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలు వితరణ



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న బత్తిన గంగన్నయాదవ్

రైల్వేకోడూరు, మే 17: మండలంలోని కె.బుడుగుంటపల్లె దళితవాడలోని రామాలయానికి ఉత్సవ విగ్రహాలను వితరణగా అందజేశారు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీ బత్తిన గంగన్నయాదవ్, ఆయన సతీమణి సుధామణి, కుమారుడు హేమంత్‌లు వీటిని అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు విగ్రహదాతలను ఘనంగా సన్మానించారు.

పాగేటి గంగమ్మ ఉత్సవ ఊరేగింపు

సంబేపల్లె, మే 17: మండలంలోని శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లి సమీపంలో నిర్మించిన పాగేటి గంగమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు సహదేవ శుక్రవారం చేపట్టారు. శనివారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాగేటి గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు.

నేడు వాసవీమాత జయంతి

నందలూరు, మే 17: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరసింహస్వామి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉదయం మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం విందు భోజనం, సాయంత్రం కోలాటాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టీడీపీ నేతల రిమాండ్ తిరస్కరించిన కోర్టు

పోలీసులకు చురకలు అంటించిన జడ్జి

యాదమరి మే 17: ఈనెల 13న పోలింగ్ సందర్భంగా మండలంలోని మాదిరెడ్డిపల్లిలో వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. పోలీసులు మాత్రం టీడీపీకి చెందిన ఎంకే విజయంద్ర యాదవ్, కే మనోహర్ యాదవ్, బాలాజీ యాదవ్, కేశవులు యాదవ్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం రాత్రి ఒకటో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్టులో 13వ తేదీన నిందితులను అరెస్టు చేసినట్లు చూపడంతో జడ్జి ముద్దాయిలను అడిగి వివరాలు నమోదు చేసుకుని, రిమాండ్‌ను తిరస్కరించారు. పోలీస్ స్టేషన్‌లోనే వారికి 41ఏ నోటీసులు ఇచ్చి పంపాలని ఆదేశించారు. కాగా చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్‌రెడ్డి తమను చిత్రహింసలు పెట్టారని నిందితులు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా సీఐకు చురకలు అంటించారు.

చేస్తారా....చేయరా?

డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌కు వైసీపీ ముఖ్య నేత ఒత్తిడి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విలువైన డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేసివ్వాలంటూ వైసీపీ ముఖ్యనేత అధికారులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గవ్యాప్తంగా వందలాది ఎకరాల డీకేటీ భూములను కొద్ది నెలల క్రితం ఫ్రీ హోల్డ్ జాబితాలో పెట్టారు. డీకేటీ పట్టా పొంది 20 ఏళ్ల పూర్తయిన భూములను ఫ్రీ హోల్డ్‌గా గుర్తించారు. వైసీపీ ముఖ్యనేత తన అనుచరులతో కొద్దినెలల క్రితం ఈ భూములను కొనుగోలు చేయించినట్లు ఆరోపణలున్నాయి.ఆయనకు సన్నిహితంగా మెలిగిన అనుచరుడు ఇటీవల తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.వాటిలో ఒకటి డీకేటీ భూముల స్కాం. మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి డీకేటీ భూముల రిజిస్ట్రేషన్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఐదు రోజుల క్రితం పోలింగ్ ముగియడంతో వైసీపీ ముఖ్యనేత చాపకింద నీరులా డీకేటీ భూముల రిజిస్ట్రేషన్ పనులను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. శుక్రవారం రెవెన్యూ అధికారులను పిలిపించి ఆయా మండలాల పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. జూన్ 4వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో వుంటుందని, అప్పటిదాకా రిజిస్ట్రేషన్‌కు క్లియరెన్స్ ఇవ్వలేమంటూ కొందరు అధికారులు చేతులెత్తేసినట్లు తెలిసింది.అయితే ఎలాగైనా చేయాలంటూ ఆయన ఒత్తిడి చేస్తుండడంతో విషయం బయటకు పొక్కింది.

ఈసీ నియమిత సిట్‌లో ఏసీబీ డీఎస్పీకి చోటు


రవిమనోహరాచారి

తిరుపతి, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లో తిరుపతి ఏసీబీ డీఎస్పీ కె.రవిమనోహరాచారికి చోటు దక్కింది. ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం ఈయన పనిచేశారు. కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్ వంటి మూడు కీలక విభాగాల్లో విధులు నిర్వర్తించిన ఈయనకు ఈ ప్రాంతంపై సమగ్రమైన అవగాహన, ఇక్కడి పరిస్థితులను అంచనా వేయడంలో అవగాహన వున్నాయి. అనేక సంచలనాత్మక కేసులను పరిష్కరించి సమర్థుడైన అధికారిగా గుర్తింపు పొందారు. తాజాగా ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత తిరుపతి, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయడం వంటివి సిట్‌కు ఈసీ అప్పగించిన బాధ్యతలు. సిట్‌లో మొత్తం 13మంది సభ్యులుండగా అందులో రాయలసీమ నుంచీ ఎంపికైన ఇద్దరు అధికారుల్లో రవిమనోహరాచారి ఒకరు. ఈసీ ద్వారా ప్రత్యేక దర్యాప్తు బృందంలో నియమితులు కావడం ఆయన సమర్థతకు, అనుభవానికి దక్కిన గుర్తింపుగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 76,369 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,927 మంది తలనీలాలు సమర్పించారు.

ఐకేఎస్‌తో వేదవర్సిటీ ఎంవోయూ

తిరుపతి రూరల్, మే 17: వైదిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న వైజ్ఞానిక విశేషాలను వెలికితీసి సమాజానికి అందించేందుకు తిరుపతిలోని ఎస్వీ వేద వర్సిటీతో భారతప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖకి చెందిన ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ (ఐకేఎస్) ఎంవోయూ కుదుర్చుకుంది. ఈమేరకు శుక్రవారం వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, ఐకేఎస్ జాతీయ కోఆర్డినేటర్ జి.సూర్యనారాయణ మూర్తి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐకేఎస్ కథనాలు రాయడం, పురాతన వేదగ్రంథాల ప్రామాణికమైన అనువాదాలను అన్ని భారతీయ భాషల్లోకి తీసుకురావడం ద్వారా కంటెంట్ అభివృద్ధి, మాన్యూస్క్రిప్ట్ డిజిటలైజేషన్, పురాతన పురాణాల నుంచి శాస్త్రీయ కంటెంట్‌తో సామాజిక ఔచిత్యంగల గ్రంథాలను గుర్తించడం, వాటిని సవరించడం, ప్రచురించడం, వేదమూలాలపై సెమినార్లు, వర్క్‌షాప్స్, కాన్ఫరెన్స్‌లు, వివిధ ఆచారాల ఆడియో-విజువల్ రికార్డులను రూపొందించడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని వీసీ వివరించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, డీన్ గోలిసుబ్రహ్మణ్యశర్మ, రాధేశ్యామ్, ఎంవీఎస్ పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కాఫీబార్ యజమాని మృతి


రాజన్న మృతదేహం

గంగవరం, మే 17: పలమనేరు - బెంగళూరు రహదారిలో జరిగిన రోడ్డుప్రమాదంలో కాఫీబార్ యజమాని మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గండ్రాజుపల్లె పంచాయతీ అనంతపురం గ్రామానికి చెందిన రాజన్న (58) గ్రామ సమీపంలోని హైవే రోడ్డుపై కాఫీబార్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంటినుంచి కాఫీబార్‌కు వెళ్లడానికి రోడ్డుపక్కన నడిచి వెళ్తుండగా బెంగళూరు నుంచి పలమనేరు వైపు వస్తున్న కేఏ05ఎంయూ 0710 నెంబరు గల క్వాలిస్ వాహనం వేగంగా ఆయన్ను ఢీకొంది. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం


మృతదేహాలకు దహన క్రియలు చేస్తున్న తండ్రి బాబు

వడమాలపేట, మే 17: ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి చెందడంతో ఎస్‌బీఆర్ పురం శోకసంద్రంలో మునిగిపోయింది. వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు రూపిక(10), చరిత(13), యూషిక గురువారం దిగువ గూళూరు గూళూరు పడి మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహాలను తీసుకువచ్చారు. చిన్నారుల మృతదేహాలను చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి బాబు తన కుమార్తెల మృతదేహాలకు దహన క్రియలు నిర్వహించారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు


కంట్రోల్ రూమ్‌లో ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 17: ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను పరిశీలించేందుకు వీలుగా ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో సీసీ టీవీ కెమెరాల డిస్‌ప్లే స్ర్కీన్‌ను ఏర్పాటు చేశామని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఎస్వీసెట్‌లో భద్రపరచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను ఆయన ఎస్పీ మణికంఠ చందోలు, ఎన్నికల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ అధికారులకు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల కింద సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవో జి.చిన్నయ్య, ఏఎస్పీ అరీఫుల్లా, కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు పాల్గొన్నారు.

ఏనుగుంటపల్లిలో అత్యధికంగా 95.44శాతం పోలింగ్

అత్యల్పంగా చిత్తూరు నాయుడు బిల్డింగ్స్ 67వ బూత్‌లో 58.61శాతం - 48 పోలింగ్ కేంద్రాల్లో 90శాతానికి మించి..

చిత్తూరు కలెక్టరేట్, మే 17: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నడూ లేనివిధంగా 81.24 పోలింగ్ శాతం నమోదయ్యింది. 2,02,850 మంది ఓటర్లలో 1,64,788 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిత్తూరు నగరంలో 150, చిత్తూరు రూరల్‌లో 31, గుడిపాలలో 45 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చిత్తూరు రూరల్ మండలం ఏనుగుంటపల్లికి చెందిన 153వ పోలింగ్ కేంద్రంలో రికార్డుస్థాయిలో 95.44 శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా చిత్తూరు నగరం నాయుడు బిల్డింగ్స్‌కు చెందిన 67వ పోలింగ్ కేంద్రంలో 923 మంది ఓటర్లకుగాను 541 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ అత్యల్పంగా 58.61శాతం పోలింగ్ నమోదైంది. రామ్‌నగర్ కాలనీలోని 82వ పోలింగ్ కేంద్రంలో 1,179 ఓటర్లకు గాను 704 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 59.71శాతం పోలైంది. నగరంలోని ఇరువారం (113వ పోలింగ్ కేంద్రం)లో 94.25, చెన్నమగుడిపల్లి (109వ పోలింగ్‌కేంద్రం) 92.03, నాయిబ్రహ్మణకాలనీ (114వ పోలింగ్‌కేంద్రం) 91.64శాతం, బండపల్లి (51వ పోలింగ్‌కేంద్రం) 91.27శాతం, పీహెచ్‌వాడ కాలనీ (126వ పోలింగ్‌కేంద్రం) 90.13శాతం, నరిగపల్లి (122వ పోలింగ్‌కేంద్రం) 90.11, గుడిపాల మండలం సి.బండపల్లి పోలింగ్ కేంద్రంలో 94.63శాతం, కట్టకిందపల్లి హెచ్‌డబ్ల్యూ పోలింగ్ కేంద్రంలో 94.46శాతం పోలింగ్ అయ్యింది. 90శాతానికి మించి 48 కేంద్రాల్లో, 80శాతానికి మించి 91 కేంద్రాలు, 70శాతానికి మించి 67 కేంద్రాలు, 60శాతానికి మించి 18, అంతకులోపు రెండు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలును పరిశీలించిన కలెక్టర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్ భద్రత పటిష్ఠంగా ఉందన్నారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులు నిత్యం బందోబస్తు నిర్వహిస్తున్నారని వివరించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ భద్రతతోపాటు కౌంటింగ్ ప్రక్రియ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, నరసింహులు, ఏఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచలకిషోర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భద్రత కఠినతరం చేయండి: ముఖేష్‌కుమార్ మీనా

తిరుపతి(కలెక్టరేట్): పోలింగ్, తర్వాత జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్ గుప్తాతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు.


పోలీసులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

అధికారులు స్ట్రాంగ్ రూమ్ పరిశీలించాక సందర్శకుల రిజిస్టర్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఫేక్ న్యూస్‌ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత భోజనాన్నీ సరఫరా చేయలేరా?

- పేదల కోసం ఆహారం అందజేస్తున్న ముక్కంటి ఆలయం
- దాన్ని ఆస్పత్రికి చేర్చేందుకు నిధులు లేవంట
- రోజుకు రూ.200 వెచ్చించలేక ఆగిన సరఫరా
- పేదలకు తప్పని పస్తులు


శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి

శ్రీకాళహస్తి, మే 17: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో పేదలకు ఆకలి కేకలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ప్రజా అవసరాలు తమకేమీ పట్టనట్లు పాలకులు, అధికారులు గాలికి వదిలేశారని నిత్యం విమర్శలు వెలువెత్తుతూనే ఉన్నాయి. ముక్కంటి ఆలయం నుంచి ప్రతిరోజూ ఉచితంగా వచ్చే భోజనాన్ని కూడా పంపిణీ చేయకుండా కేవలం ఆటో అద్దె చెల్లించలేమని సాకు చూపుతూ మంగళం పాడేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కాంట్రాక్టు ద్వారా మూడు పూట్ల నిర్దిష్టమైన పరిమాణంలో ఆహారం అందజేస్తుంటారు. అయితే ఇది కేవలం అడ్మిషన్‌లో ఉన్న రోగులకు మాత్రమే సరఫరా చేస్తారు. అడ్మిషన్‌లో ఉన్న రోగులతో పాటు వారి సంబంధీకులు ఆస్పత్రిలో పెద్ద ఎత్తున నిరీక్షిస్తుంటారు. ఇక మధ్యాహ్నం ఓపీ సమయంలో వందలాది మంది రోగులు, వారి సంబంధీకులు ఆస్పత్రికి వస్తుంటారు. మధ్యాహ్న భోజనం అవసరమైన వారంతా ఆర్టీసీ కూడలికి వెళ్లక తప్పదు. ఈ సమస్యను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి వచ్చేవారంతా రూ.5కే నాణమైన భోజనం అందుబాటులో ఉండడంతో పెద్దఎత్తున ప్రజలు ఉపయోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నా క్యాంటీన్ మూత పడిన విషయం తెలిసిందే. ఇక మళ్లీ ఆస్పత్రిలో మధ్యాహ్న భోజనం కోసం ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటినుంచి పలువురు ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆస్పత్రిలో ఉచిత భోజనం అమలు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. పలుమార్లు ముక్కంటి ఆలయ అధికారులకు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో గత యేడాది అక్టోబరులో ముక్కంటి ఆలయ నిత్యాన్నదానం నుంచి ఉచితంగా ఆస్పత్రికి భోజనం సరఫరా చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం ప్రతిరోజూ మధ్యాహ్నం సుమారు 150 మందికి ఆలయం నుంచి భోజనం సరఫరా చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఈ యేడాది మార్చి 1 నుంచి ఆస్పత్రిలో ఉచిత భోజనం పంపిణీ ఆగిపోయింది. ఆలయం నుంచి ఉచితంగా భోజనం ఇచ్చేందుకు ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ప్రతిరోజూ భోజనం ఆస్పత్రికి చేరేందుకు, తిరిగి పాత్రలు ఆలయానికి చేరేందుకు రూ.200 ఆటో బాడుగ అవుతుంది. ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిధుల నుంచి వెచ్చించలేమంటూ అధికారులు చేతులెత్తేశారు. ఆస్పత్రిలో మెయింటెనెన్స్ నిధులు వెచ్చించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకో అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఉచిత భోజనానికి మంగళం పాడేశారు. రూ.12కోట్ల నిధులతో ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేశామని నిత్యం పాలకులు, అధికారులు ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆటో బాడుగ కట్టలేమంటూ నిరుపేదల కడుపు కాలుస్తున్నారు. ఈ సమస్య తెలుసుకున్న కొందరు దాతలు ఇటీవల తాము ఆటో అద్దె చెల్లిస్తామంటూ ముందుకు వచ్చారు. కానీ ఆస్పత్రి అధికారుల్లో కనికరం కలగలేదు. ఏదో కారణంతో పేదలకు అన్నాన్ని దూరం చేస్తూనే ఉన్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యతో ప్రభుత్వాస్పత్రిలో ప్రతిరోజూ మధ్యాహ్నం పేదలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయం నుంచి వచ్చే నోటి కాడ కూడును లాగొద్దు అంటూ రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తిరుమల ఘాట్‌లో వ్యాను బోల్తా

అదుపుతప్పి కొండను ఢీకొన్న కారు
12 మందికి స్వల్పగాయాలు




మాల్వాడిగుండం వద్ద బోల్తాపడిన వ్యాన్ - కొండను ఢీకొన్న కారు - అదుపుతప్పి రోడ్డుకు అడ్డుగా నిలబడిన టీటీడీ వాటర్ ట్యాంకర్

తిరుమల, మే 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం రెండు ప్రమాదాలు జరిగాయి. చెన్నైకి చెందిన 12 మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన ఎనిమిది మంది భక్త బృందం శ్రీవారి దర్శనం ముగించుకుని ఓ వ్యానులో శుక్రవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైంది. అలిపిరికి సమీపంలో మాల్వాడిగుండం వద్ద అదుపుతప్పి వ్యాన్ బోల్తాపడింది. అదృష్టవశాత్తూ వాహనంలోని వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ నేపథ్యంలో వెనుకవస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ కూడా ఒక్కసారిగా అదుపుకోల్పోయింది. సడన్ బ్రేక్ వేయడంతో వాహనం జారి.. రోడ్డుగా అడ్డుగా నిలబడింది. అలాగే 19వ మలుపు వద్ద కూడా ఓ కారు కూడా అదుపుతప్పి కుడివైపునున్న కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోనూ చెన్నైకి చెందిన నలుగురు భక్తులు స్వల్పగాయాలో బయటపడ్డారు. వర్షం పడటంతోనే ఈప్రమాదాలు చోటుచేసుకున్నట్టు భక్తులు తెలిపారు.

చిన్నశేష, హంస వాహనాలపై గోవిందుడి విహారం



తిరుపతి(కల్చరల్) మే 17: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటలకు చిన్నశేష వాహనంపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి ఏడు గంటలకు హంస వాహన సేవ నిర్వహించారు. హంసవాహనంపై సరస్వతి రూపంలో కొలువైన గోవిందుడు కనువిందుచేశాడు. ఈ సందర్భంగా నాలుగు మాడ వీధుల్లో భక్తులు స్వామివారికి అడుగడుగునా కర్పూర హారతులు పట్టి, కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, ఇతర అధికారులు, పండితులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సింహ, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలు జరుగుతాయి.

హింసకు తావులేకుండా చూడండి

అధికారులకు ఈసీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, మే 17: పోలింగ్ ముగిసిన తర్వాత తిరుపతి రూరల్, తాడిపత్రి, అనంతపురం తదితర ప్రాంతాల్లో జరిగిన ఘటనల నేపథ్యంలో ఈసీ అధికారులను అప్రమత్తం చేసింది. ఎన్నికల కోడ్ ముగిసేవరకు 144 సెక్షన్ అమలు చేసి, ఎట్టి పరిస్థితుల్లోనూ హింసకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించింది.

డిగ్రీ పరీక్షలకు 31లోపు ఫీజు చెల్లించాలి

చిత్తూరు (సెంట్రల్), మే 17: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 4, 6 సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 31వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సెంటర్ కోఆర్డినేటర్ మీరా సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె, మే 17: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళివారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఒంటరి ఏనుగు జాడ గుర్తింపు

ఆముదాలకోన ఎస్టీ కాలనీ వద్ద గజరాజు పాదముద్రలు


ఆముదాల కోన ఎస్టీ కాలనీ చెరువు సమీపంలో ఏనుగు పాదముద్రలు

చంద్రగిరి, మే 17: చంద్రగిరి మండలం ఆముదాలకోన ఎస్టీ కాలనీ పీతల చెరువు సమీపంలోని అటవీప్రాంతంలో ఒంటరి ఏనుగు జాడను శుక్రవారం అటవీ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా పనపాకం డిప్యూటీ రేంజి అధికారి చిన బాబు ఆధ్వర్యంలో ఏనుగు జాడ కోసం గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఏనుగు పాదముద్రలు, వ్యర్థాలు కనిపించాయి. దీంతో ఎస్టీ కాలనీతో పాటు పరిసర గ్రామాల్లో ప్రజలను, రైతులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాల వద్దకు, అటవీ ప్రాంతంలోకి వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఒంటరి ఏనుగు ఈనెల 12న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్యపై దాడి చేసి చంపేసింది. అక్కడి నుంచి పూతలపట్టు మండలం మీదుగా పాకాల మండల సరిహద్దుల్లోకి చొరబడి 13న చెన్నుగారిపల్లె పంచాయతీ సమీపంలో తమిళనాడుకు చెందిన కాతవరాయన్‌పై దాడి చేసి హతమార్చింది.తాజాగా ఆ ఏనుగు తమ ప్రాంతంలో సంచరిస్తోందని తెలిసి ఆముదాల కోన ఎస్టీ కాలనీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జాడ తెలిసినందున ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ప్రయత్నిస్తున్నామని అటవీ సిబ్బంది తెలిపారు.

రైలుకింద పడి జార్ఖండ్ వాసి ఆత్మహత్య


రైలు పట్టాలపై పడివున్న మృతదేహం

కుప్పం, మే 17: కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో జార్ఖండ్ వాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసు స్టేషన్ ఎదురుగా పట్టాలపై తలతెగి పడివున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు విచారించగా జార్ఖండ్‌కు చెందిన శ్రావణ యాదవ్ (53)గా తేలింది. ఆయన బెంగళూరుకు వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాడు. ఆత్మహత్య చేసుకోవడం కోసమే రైలు పట్టాలపై తలపెట్టి పడు కున్నాడని, చక్రాల కింద తల తెగి మృతిచెందాడని పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మదనపల్లెలో ట్రాఫిక్ కష్టాలు

● పట్టణంలో ఇరుకైన రోడ్లు ● అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ ● అతీగతీ లేని ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశాలు



మదనపల్లె టౌన్, మే 17: మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ టెర్రర్ దడపుట్టిస్తోంది. ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇదే ప్రధానాంశంగా తాము గెలిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. దీన్ని బట్టి చూస్తే మదనపల్లెలో ట్రాఫిక్ సమస్య ఎంత జఠిలంగా ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా ఇరుకైన రోడ్లు, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపి షాపింగ్‌కు వెళ్లడం, పెరుగుతున్న జనాభా తదితర కారణాలతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పండుగలు, పర్వదినాలు, పనిదినాల్లో ఈ సమస్య అధికమవుతోంది. మదనపల్లె సబ్‌కలెక్టర్ చైర్మన్‌గా నియమింపబడిన ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం జరిగి ఏళ్లు అవుతోంది. అంతేకాకుండా ప్రజలు కూడా బాధ్యత లేకుండా ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫికర్ చక్రంలో పట్టణం చిక్కుకుపోయింది. అన్నమయ్య జిల్లాలో అతిపెద్ద స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ మదనపల్లె. ఇక్కడ 2లక్షల మంది ప్రజలు నివశిస్తున్నారు. వారి అవసరాలకు 700పైగా కార్లు, 5000పైగా ద్విచక్రవాహనాలు ఉన్నాయి. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల కోసం ఎంత లేదన్నా 70వేల మంది ఇళ్ల నుంచి బయటకు వచ్చి పట్టణంలో తిరుగుతున్నారు. దీంతో పాటు వాణిజ్య కేంద్రమైన మదనపల్లెకు అటు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలు, వాల్మీకిపురం, గుర్రంకొండ, పుంగనూరు, రామసముద్రం, నిమ్మనపల్లె నుంచి నిత్యం ఎంత లేదన్నా మరో 5వేల మంది మదనపల్లెకు వస్తూపోతూ ఉన్నారు. వారితో పాటు మదనపల్లె పట్టణం విద్యా, వైద్యంకు కేంద్రంగా మారడంతో మరో 10వేల మంది విద్యాసంస్థలకు, ఆస్పత్రులకు వచ్చి వెళ్తున్నారు. అంటే నిత్యం లక్ష మంది మదనపల్లె పట్టణంలో ద్విచక్ర, త్రిచక్ర, నాలుగుచక్రాల వాహనాల్లో తిరుగుతున్నారు.

నిబంధనలు అతిక్రమించి వాణిజ్య భవన సముదాయాలు

మదనపల్లె పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో వాణిజ్య భవనాల నిర్మాణాలు నిబంధనలకు అతిక్రమించి జరిగాయి. వాణిజ్య భవనాలకు తప్పనిసరిగా వాహనాల పార్కింగ్‌కు సెల్లార్ ఏర్పాటు చేయాలి. కాని ఆర్టీసీ బస్టాండు సర్కిల్, చిత్తూరు బస్టాండు సర్కిల్, అవెన్యూ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, కదిరిరోడ్డు, సీటీఎం రోడ్డులో చాలా వాణిజ్య భవనాలకు సెల్లార్ సౌకర్యం లేకుండా నిర్మించారు. గ్రౌండు ఫ్లోర్‌లోనే గదులు కట్టి అద్దెకిచ్చి కక్కుర్తి ప్రదర్శించారు. దీంతో ఈ దుకాణాలకు షాపింగ్‌కు వచ్చేవారు వారి వాహనాలను రోడ్డుపక్కన పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకైన రోడ్లు కావడం వాహనాల పార్కింగ్ తోడు కావడంతో ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ సమస్య వస్తోంది. ముఖ్యంగా పట్టణంలో ఆర్టీసీ బస్టాండు వెనుక హోటళ్లు, లాడ్జిలకు పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో వారు వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి చిత్తూరు బస్టాండు వరకు వున్న సీటీఎం వన్‌వేకు ఎదురుగా వాహనాలను పోనిస్తున్నారు. దీంతో అక్కడ కూడా ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రధాన షాపింగ్ మాల్స్, బ్యాంకులు ఈ ప్రాంతంలో ఉండటంతో ప్రజల రాకపోకలతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇకపోతే వాణిజ్య వీధిగా పేరున్న అప్పారావు వీధి కేవలం 15 అడుగుల వెడల్పు మాత్రమే వుంది. ఈ వీధిలో కొందరు వ్యాపారులు మినిలారీలను పగటి పూట రప్పించి సరుకులను అన్‌లోడి చేయిస్తుండడంతో ట్రాఫిక్‌సమస్య తలెత్తుతోంది.

అరకొర సిబ్బందితో ట్రాఫిక్‌కు ఇబ్బంది

మదనపల్లె పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏడేళ్ల క్రితం ట్రాఫిక్ సీఐగా పనిచేసిన శ్రీనివాసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్కెట్‌యార్డు పక్కన ట్రాఫిక్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో ట్రాఫిక్ సీఐను బదిలీ చేశారు. దీంతో సమస్య మొదటికి వచ్చినట్లు అయింది. ప్రస్తుతం మదన పల్లె ఒక ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐలతో పాటు కేవలం 12 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. పట్టణంలో 20 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. ఈ ప్రాంతాలకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో పండుగలు, రాజకీయ ర్యాలీలు, ఇతర సంఘాల ర్యాలీలు, పనిదినాల్లో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిష్కరించలేక పోతున్నారు.

ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం ఎప్పుడు...?

మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సబ్‌కలెక్టర్ అధ్యక్షుడుగా ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీసు అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రనిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశంపై నిర్ణయాలు తీసుకోవడంతో పాటు వాటిని అమలు చేయాల్సి ఉంది. కాని మదనపల్లెలో రెండేళ్లుగా ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశమైన దాఖలాలు లేవు. కనీసం ఇంత పెద్ద పట్టణంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లైట్లు కూడా ఏర్పాటు చేయలేదంటే ఎంత దౌర్భాగ్యం నెలకొందో అర్థమవుతోంది.

కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరేనా...?

మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యను జూన్ 4వ తేది తరువాత ఏర్పడబోయే కొత్త ప్రభుత్వమైనా పరిష్కరిస్తుందా అని పట్టణ ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో.. ఎవరు హామీలు నెరవేరుస్తారో అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి మృతి



రెడ్డివారి ప్రతాప్‌కుమార్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

కలికిరి, మే 17: టీడీపీ నాయకుడు, కలికిరి సర్పంచు రెడ్డివారి ప్రతాప్‌కుమార్ రెడ్డి (62) మృతి చెందారు. అనారోగ్యంతో గత పది రోజులుగా చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మెదడుకు రక్తస్రావం జరగడంతో ఈ నెల 5న ఉన్నపాటున తీవ్ర అస్వస్థతకు లోన య్యారు. ఆ వెంటనే చెన్నైలోని ఒక ప్రముఖ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. శనివారం పట్టణంలోని రెడ్డివారిపల్లె సమీపంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతాప్‌కుమార్ రెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కుమారుడికి వివాహం చేశారు. కాగా కలికిరి మేజర్ పంచాయతీకి 2021 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచుగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఓట్లు మెజారిటీ సాధించిన ఐదుగురు సర్పంచుల్లో ఒకరుగా గుర్తింపు తెచ్చుకున్నారు. పట్టణంలో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర కార్యకలాపాల నిర్వహణలో ఆయన పట్టణవాసుల ఆదరణ పొందారు. అంతేగాకుండా వివిధ సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటూ ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హైదరా బాదు నుంచి కలికిరి చేరుకున్నారు. శనివారం జరిగే అంత్యక్రియల్లో ఆయన పాల్గొననున్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

రామసముద్రం, మే 17: తాగుడుకు బానిసైన భర్తను భార్య మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయి విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రామసముద్రం మండలం ఎం.గొల్లపల్లెకు చెందిన మధు(26) రామసముద్రంలో బంగారు నగలకు మెరుగులు దిద్దేపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి తాగుడు అలవాటు ఉంది. ఈనేపథ్యంలో గత 14తేదీ మధు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తాగుడు మానలేని భర్తను భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మధు 15తేదీ ఇంటికి రాకపోవడంతో భయాందోళన చెందిన భార్య శ్వేత తన భర్త కనిపించడం లేదని 16వ తేదీన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనేపథ్యంలో రామసముద్రం నుంచి గుకుంటకు వెళ్లే దారిలో పొలాలోని ఒక నిర్మానుష్యంగా ఉన్న స్థలంలో శుక్రవారం మధు మృతదేహం కనిపించింది. మృతదేహం ప్రక్కన మద్యం బాటిళ్లు ఉండడంతో మద్యంతో పాటు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా గతంలో మృతుని తల్లి, తండ్రి, తమ్ముడు కూడా వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకుని చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, మే 17: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు శుక్రవారం మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. స్థానిక అనపగుట్టకు చెందిన లక్ష్మీనారాయణ, రమాదేవిల కుమారుడు నరేష్ (32) గురువారం బైపాస్ రోడ్డుకు సమీపంలోని కొండామరిపల్లె గ్రామం వద్ద కంకర్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి పురుగులు మందు తాగి అక్కడ నుంచి అనపగుట్టలోని తమ ఇంటివద్దకు వచ్చి పడిపోయాడు. గమనించిన కటుంబసభ్యులు వెంటనే నరేష్‌ను జిల్లాప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్యం తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. అక్కడి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం నరేష్ మృతి చెందాడు. ఇతను పీటీఎం మండలంలోని అంకిరెడ్డిపల్లెలో స్పిరిట్ తయారు చేసే ఫాక్టరీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణంతో పురుగులుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతిలోని స్విమ్స్‌కు మదనపల్లె తాలుకా స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాధిక్ వెళ్లి మృతదేహనికి పంచనామా నిర్వహించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెడ్‌కానిస్టేబుల్ సాధిక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట,మే17: బి.కొత్తకోట పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పీటీయం మండలం తుమ్మరకుంట పంచాయతీ బొమ్మకపల్లె కు చెందిన విద్యార్థులు అభిషేక్(16), శ్రీరక్షక్(17), చరణ్(17)లు తమ స్వగ్రామం బొమ్మకపల్లె నుంచి బి.కొత్తకోటకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్‌లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వారికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడి విహారం



ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న ఈవో రమణ, అర్చకులు

మదనపల్లె అర్బన్, మే 17: స్థానిక దేవళంవీధిలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు విహరించి శుక్రవారం భక్తులను కటాక్షించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొల్పి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలతోపాటు విశేషపూజలు, హోమాలు చేశారు. అంతకు ముందు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలను ప్రారం భించారు. ఈనెల 27వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎస్బీఐ, రెడ్డెప్ప నాయు డు కాలనీ వాసులు కలిసి కాలనీలో సూర్యప్రభవాహనంపై శ్రీని వాసు డిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ఊరేగింపు నిర్వహించారు. ఇందులో దేవరెద్దు, కోలాటం ప్రత్యేకతగా నిలిచాయి. కాలనీలోని పురవీధులో వేంకటేశ్వర స్వామి వారికి ఇంటింటి వద్ద కాయకర్పూర నీరజనాలు సమర్పించారు. కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా భక్తులకు తీర్థప్ర సాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమణ, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, జాయిం ట్ సెక్రటరీలు సురేష్, రామలింగారెడ్డి, ట్రెజరర్ ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ ద్వారక నాథరెడ్డి, రాటకొండ ఆనంద్, వాసుదేవనాయుడు, కంభం నాగభూష ణంరెడ్డి, సిద్దారెడ్డి, రామచంద్రారెడ్డి, వైఎస్ మునిరత్నం, శివశంకర్, మధు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, మే 17: స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 28 వతేదీ రాత్రి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా ప్రతిష్ఠింపచేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయకమిటీ తెలిపింది. అలాగే అదే రోజు రాత్రి జాతర, 29 వతేదీ పగలు తిరుణాల అత్యంతవైభవంగా నిర్వహించాలని ఆలయకమిటీ సభ్యులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో కోర్టులో గంగమ్మ జాతర పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అంతకముందే ఆలయంలో శుక్రవారం మహిళలు అధికసంఖ్యలో పొంగళ్లు నైవేద్యంగా తెచ్చి, చీర, జాకెట్లుతో పసుపు, కుంకుమ, అమ్మవారికి సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు (బాబు), ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళెం కరుణాకర్‌నాయుడు, ఆలయకమిటీ గౌరవాధ్యక్షుడు జోలెపాళెం భవానీప్రసాద్, సభ్యులు మార్పురి మహేస్, మార్పురివిక్కి, దేవేంద్ర(చిన్ని), బీటి శ్రీనివాసులునాయుడు, ఉపాడ్ల కృష్ణకుమారి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ జయంత్యుత్సవాలు



మదనపల్లెలో ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



అన్నదానం చేస్తున్న నవయుగ స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మే 17: స్థానిక వాసవీభవన్ వీధిలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనె 20వ తేదీవరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మదనపల్లె ఆర్యవైశ్య సంఘం నేతలు పేర్కొన్నారు. కాగా శుక్రవారం వాసవీమాత ఆలయలో ఉదయం సుప్రభాత సేవతో మేల్కొల్పి మదనపల్లె ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అభిషేకాలు అర్చనలతో విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారి సహస్రనా మపారాయణం చేశారు. ఇదిలా ఉండగా శనివారం (ఈనెల 18న) వాసవీ మాత జయంతి సందర్భంగా ఉదయం 5.30 గంటలకు ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుం చి కన్యకలు, దంపతులచే గంగ తెచ్చు కార్యక్రమం, ఉదయం 10గంట లకు గణపతి హోమం, వాసవీమాత మూలమంత్ర హోమం, 11 గంటలకు పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 5గంటలకు పుష్పపల్లకి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతాసతీష్, సూరేగిరిధర్ తోపాటు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు, యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధనోత్సవాలు

మదనపల్లె అర్బన్, మే 17: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు స్థానిక వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు, నవయుగ స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం అభిషేకాలు, అర్చనలు విశేషంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో నవయుగ స్వర్ణకా రుల సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ అప్పినిపల్లె భాస్కరాచారి ఆధ్వర్యంలో సుమారు రెండు వేలమంది అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణాచారి, ప్రసాద్, యుగంధర్, చంద్ర, ప్రభాకర్, దిలీఫ్, చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్యాలమ్మ తిరుణాల

ములకలచెరువు, మే 17: మండలంలోని బురకాయలకోట సమీపంలో వెలసిన ముత్యాలమ్మ తిరుణాల ఉత్సవాలు శనివారం నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. శనివారం గోపూజ, ఆలయ శుద్ధి, గణపతి పూజ, కలశస్థాపన, కుంకుమార్చన, మహా మంగళహారతి ఉంటుందన్నారు. ఆదివారం కూష్మాండబలి, జ్యోతులు సమర్పణ, , సోమవారం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పాఠశాలకు రక్షణ గోడ ఏర్పాటు చేయండి



: ముష్టూరులో ఉన్న కస్తూరిబా పాఠశాల

నిమ్మనపల్లి, మే 17: మండలంలోని ముష్టూరు పంచాయతిలోని కస్తూరిబా పాఠశాలకు రక్షణగోడ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు కోరుతున్నారు. రక్షణగోడ లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల ప్రారంభమై 10ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ప్రహరీ గోడ నిర్మంచలేదన్నారు. పాఠశాలలో 6వతరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 500 మందికి పైగా విద్యార్థినులు విద్యను అభ్యసిస్తూన్నారు. అయితే ఈ పాఠశాలలో ముఖ్యంగా డ్రాప్‌అవుట్ అయిన పిల్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు చేర్చుకోవడమే కాకుండా వారికి అన్ని రకాల వసతులతో పాటు విద్యను బోధిస్తున్నారు. ముఖ్యంగా కస్తూరిబా(గురుకుల) పాఠశాల కావడంతో విద్యార్థినులు అందరూ పాఠశాలలోనే ఉండాల్సివస్తుంది. ఇదిలా ఉండగా ఇక్కడ పాఠశాలలో విద్యార్థినులకు అన్ని వసతులు ఉన్నా ప్రహరీ లేక పోవడంతో రాత్రి సమయంలో భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యార్థినుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని సంబంధిత అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం కనిపించలేదణి తల్లిదండ్రులు వాపోతు న్నారు. కనీసం ఈ ఏడాది అయినా ప్రహరీ నిర్మించి విద్యార్థుల కు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుచున్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత!

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



మురుగునీటి కాలువలో పూడిక తీయిస్తున్న పంచాయతీ, ఆర్టీసీ అధికారులు

పీలేరు, మే 17: పీలేరు ఆర్టీసీ బస్టాండుకు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులకు అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పీలేరులోని పలు మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు, ఆర్టీసీ బస్టాండు దుస్థితిపై 'చినుకు పడిన వేళ చూడాలి పీలేరులో ఇంజనీరింగ్ అద్భుతాలు' అన్న శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులతోపాటు ఆర్టీసీ బస్టాండుకు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికతీత పనులను కూడా ప్రారంభించారు. ఇదిలా ఉండగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్టాండులో నెలకొన్న పరిస్థితు లను పరిశీలించేందుకు మదనపల్లెలోని ఆర్టీసీ ఏఈ సిద్దరాములును ప్రత్యేకంగా పీలేరుకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండులో నెలకొన్న మురు గునీటి పారుదల వ్యవస్థను మార్చేందుకు అధ్యయనం చేస్తున్నామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని ఈ ఏడాదిలో ఆ పనులు ఓ కొలిక్కి వచ్చే అవకాశముందన్నారు. అయితే ఆర్టీసీ అధికారుల తీరుపై పంచాయతీ అధికారులు పెదవి విరుస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో మురుగునీటి వ్యవస్థ, పారిశుధ్య పనుల బాధ్యత పూర్తిగా ఆర్టీసీ అధికారులదేనని, ఇబ్బందులు వచ్చినప్పుడల్లా తమపై భారం నెట్టేస్తున్నారని వారు వాపోయారు. ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతం నుంచి బస్టాండుకు ఆనుకుని ఉన్న మురుగునీటి కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్యలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం జరిగిన పూడికతీత పనులను డీఎం బండ్ల కుమార్, ఈవో గఫూర్, శానిటరీ అధికారి రవి పర్యవేక్షించారు.

ప్రజలు రక్తపోటుపై అవగాహన కలిగిఉండాలి



రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వెంకట్రామయ్య

తంబళ్లపల్లె, మే 17: ప్రజలందరూ రక్తపోటుపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినోత్సవానికి న్యాయాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకట్రామయ్య మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ రక్తపోటును తనిఖీ చేసుకుంటే జీవిత కాలాన్ని మెరుగు పరుచుకునే అవకాశం ఉందన్నారు. రక్తపోటు గురించి అవగాహన పెంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని, ప్రతి రోజూ తీసుకునే ఆహారంలో ఉప్పు తక్కువగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సిడి వైద్యులు రిచర్డ్, విక్రాంత్‌రెడ్డి, తేజస్విని, ఎన్‌సిడి సిబ్బంది శారద, సుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తపోటు నియంత్రణతోనే ఆరోగ్యం



వాల్మీకిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, మే 17: రక్తపోటు నియం త్రణతోనే ఆరోగ్యంగా జీవిద్దామని వాల్మీకిపురం మండల చింతపర్తి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీవిద్య పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు (బీపీ) దినోత్సవం సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి రక్తపోటు లక్షణాలు తలనొప్పి, వికారం, గుండె దడ, అలసట, చూపు మసకబారడం, శ్వాస ఆడక పోవడం, మూత్రపిండాలు పనితీరు దెబ్బతినడం, గుండె స్పందన రేటులో వ్యత్యాసాలు రావడం చెవిలో శబ్దం, ముక్కు నుంచి రక్తం కారుట వంటివన్నారు. ప్రతీ ఒక్కరూ 30సంత్సరాలు పైబడిన వారు కనీసం 3నెలలకు ఒకసారి బీపీ చెక్ చేసుకుని 120/80 ఉందా లేదా అని చూసుకోవాలని జీవన శైలిలో ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఇందిరారాణి, ఆరోగ్య వైద్యాధికారి మహ్మద్ రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రైతులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్

ములకలచెరువు, మే 17: రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు వెళ్లాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. ములకలచెరువులో శుక్రవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో రైతులు విరివిగా టమోటా పంటలు పండించి గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. టమోటాకు గిట్టుబాటు ధర కోసం, భూ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎండ్లపల్లె వెంకటరమణ, నాయకులు ఆంజనేయులు, నారాయణ, వెంటకస్వామి, అనీల్‌కుమార్, నాగరాజు, గణేష్, వెంకటరమణ, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణసాయి కుటుంబానికి ఆర్థిక సాయం

పీలేరు, మే 17: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కృష్ణ సాయి కుటుంబానికి ఆర్థిక సహాయం లభించింది. బహుజన బిల్డింగ్ వర్కర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.బలరామ్ ఆధ్వర్యంలో రూ.11,200ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ ఆలీ బేగ్, జిల్లా కార్యదర్శి రసూల్, కోశాధికారి ఎన్టీఆర్ నఫీజ్, స్థానిక నాయకులు ఎమ్మార్పీఎస్ గండికోట వెంకటేష్, చంద్రమౌళి ఆచారి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

గుర్రంకొండ, మే 17:రామానాయుని చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, గనులశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన తరిగొండ రామానాయుని చెరువులో ఇసుక కోసం తవ్విన గుంతలను పరిశీలించారు. చెరువులో ఇష్టానుసారంగా అక్రమార్కులు ఇసుక తోడేస్తుంటే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. అధికారులు చెరువులు, కుంటలను ఇసుక వ్యాపారులను నుంచి రక్షించి భూగర్భ జలాలు పెరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మురళీ, రైతులు పాల్గొన్నారు.

22న డయల్ యువర్ డీఎం

మదనపల్లె అర్బన్, మే 17: మదనపల్లె వన్‌అండ్ టూ డిపోల పరిధిలో ఈ నెల 22న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల వలన, ఆర్టీసీ సిబ్బంది వలన ప్రయాణికులకు కలిగే సమస్యలను పరిష్కరించడానికి, ఆర్టీసీకి ఆదాయం పెంచుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలంటే ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో తెలియజేయాలని డీఎం విజ్ఞప్తి చేశారు. మీ సమస్యలను ఈ ఫోన్ నెంబరుకు 9959225676కు తెలియజేయాలని కోరారు.

టీడీపీ బీసీ సెల్ పార్లమెంటు కార్యదర్శిగా అశోక్‌కుమార్



బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న అశోక్‌కుమార్

తంబళ్లపల్లె, మే 17: టీడీపీ రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శిగా గుండ్లపల్లెకు చెందిన గుట్టపాలెం అశోక్‌కుమార్ నియమితులయ్యారు. రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు ఆదేశాలతో పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అశోక్‌కుమార్ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... తనకీ అవకాశం కల్పించిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి, నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జునాయుడుకు తంబళ్లపల్లె టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.